# విశాల భారతి

తెలుగు దినపత్రిక

21-12-2025

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి:3 సంచిక: 351


## జంగిల్ రాజ్ నుంచి విముక్తి కల్పించాలి

- ప్రధాని నరేంద్ర మోదీ బెంగాల్‌లో ఆయన పర్యటించారు
- జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలని పేర్కొన్నారు
- వందేమాతరాన్ని దేశ నిర్మాణానికి మంత్రంగా మార్చాలన్నారు
- ప్రధాని మోదీ బంకిం చంద్ర ఛటర్జీకి నివాళులర్పించారు
- చొరబాటుదారులకు టీఎంసీ రక్షణ కల్పిస్తుందని ఆరోపించారు
- టీఎంసీ రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు



**విశాలభారతి, నేషనల్:**

జంగిల్ రాజ్ నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బెంగాల్‌లో ఆయన పర్యటించారు. పశ్చిమ బెంగాల్‌లోని తాహేర్‌పూర్‌కు వెళ్లారు. ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ల్యాండింగ్ సాధ్యం కాలేదు. కొంతసేపు హెలిప్యాడ్‌పై చక్కర్లు కొట్టి కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ప్రధాని విమానాశ్రయం నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 3లో..

## జగన్ బర్త్ డే.. జనంలోకి కేసీఆర్




**మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు**

- కేసీఆర్ అధ్యక్షతన ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు జరగుతుంది
- నదీ జలాల విషయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యంపై సమరశంఖం పూరించనున్నారు
- సాగునీటి హక్కుల కోసం మరోఉద్యమంపై దిశానిర్దేశం చేయనున్నారు
- ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది
- మాజీ సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు
- ఆ ఫ్లెక్సీలో కేసీఆర్, కేటీఆర్ శుభాకాంక్షలు చెబుతున్నట్లు ఏర్పాటు చేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు కేసీఆర్. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. శనివారం తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు. కేసీఆర్ అధ్యక్షతన ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ సమాజం ముందు దోషిగా నిలబెడతామని బీఆర్ఎస్ చెబుతోంది.

మిగతా 3లో..



## బీజేపీలో చేరిన నటి ఆమని

- ప్రముఖ నటి ఆమని రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు
- ఆమె చేరిక రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు
- ఆమని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు
- భారతీయులమని చెప్పకోవడానికి గర్వంగా ఉందని అన్నారు

02



## పాకిస్తాన్ మాజీ ప్రధానికి 17 ఏళ్ల జైలు

- పాకిస్థాన్ ఎఫ్ఐఏ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది
- ఇమ్రాన్ ఖాన్, ఆయన సతీమణికి 17 ఏళ్ల జైలుశిక్ష విధించింది
- ఈ మాజీ ప్రధాని తన అధికారాన్ని దుర్వినియోగం చేశారనే అభియోగం
- జైలుశిక్షతో పాటు రూ.1.64 కోట్లు చొప్పన జరిమానా
- ప్రధాని హోదాలో నేరపూరిత విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు
- అక్టోబరులో ప్రత్యేక కోర్టులో తోషఖానా-2 కేసుపై విచారణ జరిగింది

02

## డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్

- ఎల్బీ స్టేడియంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు
- ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగ క్రిస్మస్ అన్నారు
- ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు నేర్పించారు
- కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందన్నారు
- సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం తెలిపారు
- గాంధీ పుట్టినరోజు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిసెంబర్‌లోనే జరిగాయన్నారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రజలు నచ్చిన మతాన్ని ఆచరించవచ్చని, ఎవరైనా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడితే కఠినంగా ప్రభుత్వం శిక్షిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మతాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడిన వారిని కఠింగా శిక్షించేందుకు కర్ణాటక రాష్ట్రంలో ఇటీవలే తెచ్చిన కొత్త చట్టాన్ని రాష్ట్రంలోను ఈ బడ్జెట్ సమావేశాల్లో తేనున్నట్లు చెప్పారు. ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మిగతా 2లో..

## ఓటును శాసించిన నోటు

- పంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలకే పై చేయి
- గెలుపు కోసం లక్షల్లో ఖర్చు చేసిన అభ్యర్థులు
- అంత ధనవ్యయం చేసింది ఏం ఆశించో అర్థం కాని వైనం
- ఓట్లకు నోట్ల పంపకాన్ని అడ్డుకోలేక పోయిన సర్కార్



04



## 18 మంది ఎమ్మెల్యేలకు సీఎం వార్నింగ్

- పంచాయతీ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ పాల్గొన్నారు
- కొందరి ఎమ్మెల్యేలకు సీఎం స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం
- ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది
- సొంత బంధువులకు టికెట్ ఇచ్చి పార్టీకి నష్టం చేశారంటూ సీరియస్
- ఇది రిపీట్ అయితే ఉరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి వారికి వార్నింగ్

03

## ఉపాధికి తూట్లు

- ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ ఆందోళన
- హైదరాబాద్ పారడైజ్ ఎంజీ రోడ్డులో నిరసన కార్యక్రమం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పాల్గొన్నారు
- గాంధీ అనే పదం వినిపిస్తేనే మోదీకి వణుకు పుడుతోందన్నారు
- ప్రధాని, మోదీ అమిత్ షాలు గాడ్సే వారసులని మండిపడ్డారు
- ఉపాధి హామీ పథకంలో కోత పెట్టారని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు
- పేరు మార్పుపై సోనియాగాంధీ తొలిసారి స్పందించారు
- ఉపాధి హామీ పథకంపై బుల్డోజర్ నడిపారని అన్నారు

02



## రేవంత్ ప్రభుత్వానికి హనీమూన్ ముగిసింది

**ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి ఫైర్ అయ్యారు**

- సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు
- తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు
- రేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియడం లేదు
- రేవంత్ రెడ్డి మాదిరి నేను చిల్లర రాజకీయాలు చేయనన్నారు
- కేసీఆర్ ఆదివారం అన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారని వెల్లడి

03



## ఉపాధిని కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లు పై ఆగ్రహం
- జి రామ్ జి ఉపాధి బిల్లును వెంటనే పసంహరించుకోవాలి
- బిల్లు ప్రతులు దగ్ధం చేసి నిరసన తెలియజేసిన సిపిఎం

03




# జంగిల్ రాజ్ నుంచి విముక్తి కల్పించాలి

( మొదటిపేజీ తరువాయి )

బంకిం చంద్ర ఛటర్జీకి నివాళులర్పించారు. వందేమాతరం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మంత్రమని, వందేమాతరాన్ని దేశ నిర్మాణానికి మంత్రంగా మార్చాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం దేశ పౌరులతో భుజం భుజం కలిపి నడుస్తోందని తెలిపారు. జీఎస్టీ బెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ప్రజలకు గొప్ప ఉపశమనం ఇచ్చిందని, దుర్గాపూజ, ఇతర పండుగల సమయంలో దేశవ్యాప్తంగా ప్రజల చాలా ప్రయోజనం పొందారన్నారు. బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ నుంచి రక్షణ లభిస్తోందని ఆరోపించారు. గంగానది బీహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుందని, బీహార్ బెంగాల్‌కు మార్గం చూపిందని పేర్కొన్నారు. బెంగాల్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేయాలని పిలుపునిచ్చారు. తాను బెంగాల్ ప్రజలకు మనస్ఫూర్తిగా అంకితమయ్యానని, రాష్ట్రానికి నిధుల కొరత లేదన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్న ఆయన.. బీజేపీని వ్యతిరేకించాలనుకుంటే టీఎంసీ వ్యతిరేకించవచ్చని, రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవడం అర్థరహితమన్నారు.



బీజేపీకి ఒక అవకాశం ఇచ్చి, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూ.3200 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించారు. నదియా జిల్లాలోని జాతీయ రహదారి 34లోని బర్జగులికృష్ణానగర్ సెక్షన్‌కు చెందిన 66.7 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల రహదారిని ప్రారంభించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బరాసత్‌బర్జగులి సెక్షన్‌కు చెందిన 17.6 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల రహదారికి శంకుస్థాపన చేశారు.

అస్సాం మౌలిక సదుపాయాల రంగంలో శనివారం ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. గువహటిలోని లోకప్రియ గోపీనాథ్ బోర్డోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మించిన అత్యాధునిక కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా ప్రారంభించారు. దాదాపు 4,000 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది భారతదేశంలోనే మొదటి 'ప్రకృతి ఆధారిత' విమానాశ్రయ భవనం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ.. ఇది కేవలం అస్సాం అభివృద్ధి మాత్రమే కాదని, మొత్తం ఈశాన్య రాష్ట్రాల పురోగతికి నిదర్శనమని కొనియాడారు. ఈశాన్య భారతం జరుపుకుంటున్న ఈ 'అభివృద్ధి పండుగ'ను యావత్ దేశం గమనిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అస్సాం ప్రజలు, ముఖ్యంగా అక్కడి తల్లులు, సోదరీమణులు చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఈ ప్రాంత అభివృద్ధి కోసం మరింత కష్టపడేలా తనలో స్ఫూర్తిని నింపుతున్నాయని మోదీ ఎంతో భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ నూతన టెర్మినల్ అందుబాటులోకి రావడం వల్ల ప్రయాణికుల రద్దీ తగ్గడమే కాకుండా, ఈశాన్య రాష్ట్రాల్లో పర్యాటకం, వాణిజ్యం, ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 1979 అస్సాం ఉద్యమంలో ప్రాణాలర్పించిన 860 మంది అమరవీరులకు నివాళులర్పించనున్నారు. వారి స్మారకార్థం నిర్మించిన 'స్వహిద్ స్మారక క్షేత్రం' వద్ద ఆయన ప్రత్యేక శ్రద్ధాంజలి ఘటించనున్నారు. ఆదివారం ఉదయం బ్రహ్మపుత్ర నదిపై 'చరాయిదేవ్' నౌకలో ప్రయాణిస్తూ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా 25 మంది పాఠశాల విద్యార్థులతో ప్రధాని ముచ్చటించనున్నారు. పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలో సుమారు 30 నిమిషాల పాటు వారితో తన అనుభవాలను పంచుకోనున్నారు.

గువహటి కార్యక్రమాల అనంతరం ప్రధాని దిబ్రూగఢ్ మీదుగా నామ్‌రూప్‌కు చేరుకుంటారు. అక్కడ రూ. 12,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న అమ్మోనియాయూరియా ఎరువుల కర్మాగారానికి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు అస్సాంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతుందని, స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని భావిస్తున్నారు. దేశీయ ఎరువుల ఉత్పత్తిలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించి మోదీ తమ అస్సాం పర్యటనను ముగిస్తారు.

# బేజేపీలో చేరిన నటి ఆమని

- ప్రముఖ నటి ఆమని రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు
- ఆమె చేరిక రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు
- ఆమని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు
- భారతీయులమని చెప్పుకోవడానికి గర్వంగా ఉందని అన్నారు
- ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటి ఆమని రాజకీయ రంగంలోకి అడుగుపెట్టడం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. శనివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకుని అధికారికంగా బీజేపీలో చేరారు. సినీ రంగానికి చెందిన ప్రముఖులు రాజకీయాల్లోకి రావడం కొత్తేమీ కాకపోయినా, ఆమని చేరికకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోంది. ఆమెకు ఉన్న అభిమాన బలం, సామాజిక అంశాలపై గతంలో ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు పార్టీకి ఉపయోగపడతాయని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలే రాంచందర్‌రావుతో భేటీ అయిన ఆమని ఆ సమావేశంలో రాజకీయ పరిస్థితులు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు. కొద్దిరోజులకే ఆమె బీజేపీలో చేరడం ఆసక్తి రేపుతోంది. బీజేపీలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు. "మోదీ ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. భారతీయులమని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నాను. సనాతన ధర్మ పరిరక్షణ కోసం కూడా మోదీ కృషి చేస్తున్నారు" అని ఆమె వ్యాఖ్యానించారు. రాజకీయాల్లోకి రావాలన్న తన నిర్ణయం వెనుక ప్రజాసేవే ప్రధాన లక్ష్యమని ఆమని స్పష్టం చేశారు.

అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అన్నారు. పార్టీ గుర్తులపై జరగబోయే ఈ ఎన్నికల్లో బీజేపీని ఆదరించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందుకోసం సమగ్రమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వీటితో పాటు జీహెచ్ఎంసీ ఇతర మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇవాళ బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మాట్లాడిన కిషన్ రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు.


పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని అబద్ధాలు చెబుతున్నారని, ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఎలా తీర్పు ఇచ్చారని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు రాజ్యాంగం అంటే గౌరవం లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి సిగ్గులేకుండా కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఇవాళ కోర్టు తీర్పు నేపథ్యంలో తాము ఫిరాయించలేదని మాట మారుస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలది నీచమైన చరిత్ర అని ఈ రెండు పార్టీలు తెలంగాణ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. స్పీకర్ తీర్పు తెలంగాణ ప్రజలకు అర్థం కావడం లేదని స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించాలన్నారు. నరేగా చట్టాన్ని కేంద్రం మరింత పటిష్టం చేసిందన్నారు.

ఇక ఆమని సినీ ప్రస్థానం విషయానికి వస్తే తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో టాలెంటెడ్ నటిగా గుర్తింపు పొందిన ఆమని ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన సూపర్ హిట్ చిత్రం "జంబలకిడిపంబ" (1992)తో నరేష్ సరసన కథానాయికగా ఆమె సినీ అరంగేట్రం చేశారు. ఈ సినిమా ఆమె కెరీర్‌కు బలమైన పునాది వేసింది. అనంతరం బాపు దర్శకత్వంలో వచ్చిన "మిస్టర్ పెళ్లాం" చిత్రంలో ఆమె నటనకు గాను ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సినిమా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డు పొందగా, ఆమని ఉత్తమ నటిగా నంది అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ చిత్రం ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆమని కెరీర్‌లో శుభలగ్నం, శుభ సంకల్పం చిత్రాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఆ నలుగురు, చావు కబురు చల్లగా, '(మిడిల్ క్లాస్ అబ్బాయి)' వంటి చిత్రాలు ఆమె నటనకు మరింత గుర్తింపు తెచ్చాయి. నటిగా ఆమెకు రెండు నంది అవార్డులు, ఒక ఫిలింఫేర్ అవార్డు లభించడం విశేషం. వ్యక్తిగత జీవితానికొస్తే తమిళ సినిమా నిర్మాత ఖాజా మొహియుద్దీన్‌ని వివాహం చేసుకున్న అనంతరం కొంతకాలం సినీ రంగానికి దూరమైన ఆమని 2003లో రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన "మధ్యాహ్నం హత్య" చిత్రంతో తిరిగి నటన ప్రారంభించారు. ఇటీవల కూడా ఆమె వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. సినిమాలతో పాటు టీవీ సీరియళ్లలోనూ ఆమె నటిస్తున్నారు. మొత్తంగా చూస్తే సినీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమని రాజకీయాల్లోకి రావడం రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపునిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వరుసగా ఢీకొన్న మూడు కార్లు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం 11 గంటలకు మెహిదీపట్నం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై పిల్లర్ నెంబర్ 253 సమీపంలో పొగమంచు రావడంతో మూడు కార్లు ఒకదాని వెనక మరొకటి ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. వాహనాలు ఢీకొనడంతో రెండు వైపులా సుమారు 6 కిమీ వరకు వాహనాలు స్తంభించిపోయాయి. వాహనదారుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



# డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్

( మొదటిపేజీ తరువాయి )

ఏసుక్రీస్తు బోధనలు, ప్రజా ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. "డిసెంబర్ నెల కేవలం క్రీస్తు ఆరాధకులకు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలకు మరియు కాంగ్రెస్ పార్టీకి కూడా ఒక 'మిరాకిల్ మంత్' (అద్భుతాల మాసం)" అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఇదే నెలలో జన్మించినట్లు చెప్పారు. వందలాది మంది తెలంగాణ రాదని ఆత్మహత్యలు చేసుకుంటుంటే సోనియాగాంధీ భారీ రాజకీయ మూల్యం చెల్లించి మరీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారన చెప్పారు. అదే రీతిలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ( కాంగ్రెస్ ) ఏర్పడింది కూడా ఇదే డిసెంబర్ నెలలో కావడం విశేషమని ఆయన గుర్తు చేశారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి, ద్వేషించే వారిని సైతం ప్రేమించాలన్న ఏసుక్రీస్తు సందేశం ప్రపంచానికి ఎంతో అవసరమని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభువు బోధనల స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎవరు దుష్ప్రచారం చేసినా రాష్ట్రంలో శాంతిని కాపాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం ఈ సందర్భంగా వివరించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, సొంత ఇల్లు లేని పేదలకు వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తూ పేదల ఇళ్లలో వెలుగులు నింపామని. 3 కోట్ల 10 లక్షల మంది పేదలను మా కుటుంబ సభ్యులుగా



భావించి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ చేయడమే కాకుండా, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చాం.

ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇస్తే.. అదే అంకితభావంతో క్రిస్టియన్ మిషనరీలు పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించాయని సీఎం కొనియాడారు. ప్రభుత్వంతో పోటీ పడి వారు చేస్తున్న సేవలు ఒక యుద్ధంలా, యజ్ఞంలా సాగాయని అభినందించారు. క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలు అమోఘమని సీఎం రేవంత్ ప్రస్తుతించారు. రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడటంపై సీఎం కఠిన వ్యాఖ్యలు చేశారు. "ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించాలి. ఇతర మతాలను కించపరిచేలా మాట్లాడితే కఠినంగా శిక్షించేలా శాసనసభలో చట్టాన్ని సవరిస్తాం" అని ఆయన ప్రకటించారు. మత ప్రాతిపదికన దాడులకు పాల్పడే వారిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని హెచ్చరించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఈ చట్టం తెనున్నట్లు చెప్పారు. కర్ణాటకలో ఇటీవలే కాంగ్రెస్ సర్కార్ ఇలాంటి చట్టం తెచ్చినట్లు వివరించారు.

మైనారిటీలకు అందుతున్న సంక్షేమ పథకాలు ఎవరి దయ కాదని, అవి వారి హక్కు అని సీఎం స్పష్టం చేశారు. క్రిస్టియన్, ముస్లిం స్మశాన వాటికల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 'తెలంగాణ రైసింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ద్వారా అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# ఉపాధికి తూట్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని తెలంగాణ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. దీనిని వ్యతిరేకిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్ పారడైజ్ ఎంజీ రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. గాంధీ అనే పదం వినిపిస్తేనే ప్రధాని మోదీ , కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వణుకు పుడుతోందని విమర్శించారు.

**'యావత్ దేశాన్ని అవమానించారు'**

ప్రధాని, మోదీ అమిత్ షాలు గాడ్సే వారసులని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయంగా సోనియా గాంధీ కుటుంబాన్ని ఎదుర్కొనే ధైర్యం వారికి లేదని మండిపడ్డారు. గాంధీ పేరు తొలగించడమంటే.. యావత్ దేశాన్ని అవమానించినట్లేనని అన్నారు. తమకు సంఖ్యా బలం ఉంది కదా అని పార్లమెంటులో బిల్ పాస్ చేసుకున్నారని మండిపడ్డారు. అయితే మోదీ, అమిత్ షాలు ఓ విషయం గుర్తుంచుకోవాలని.. ఈ ప్రపంచం ఉన్నంతవరకూ గాంధీ పేరు ఉంటుందని స్పష్టం చేశారు. 2014లో అధికారంలో వచ్చిన మోదీ ఉపాధి హామీ పథకంలో కోత పెట్టారని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. ఇప్పుడు పేరు మార్చారంటూ దుయ్యబట్టారు. మోదీ, అమిత్ షాలు ఎన్ని కుతంత్రాలు చేసినా మహాత్మ గాంధీని తమ హృదయాల నుంచి తీసివేయలేరని స్పష్టం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కోర్టులు మొట్టికాయలు వేసినా బీజేపీకి బుద్ధి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగాన్నే మార్చే కుట్రలు చేస్తున్నారన్నారు. 'మీరు ఎన్ని కుట్రలు చేసినా.. ఖబర్దార్ మోదీ' అంటూ సవాలు విసిరారు. 'మీ పప్పులు ఉడకవు, మీకు గుణపాఠం తప్పదు' అంటూ టీపీసీసీ చీఫ్ కేంద్రంపై మండిపడ్డారు. రోవైపు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సైతం మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని తప్పుబట్టారు. 'సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఎంజీఎన్ఆర్ఈజీఏ చట్టాన్ని తీసుకొచ్చారు. దాని ద్వారా పేద వారికి పని కల్పించాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. 20 ఏళ్లుగా యూపీఏ ప్రభుత్వం పేదలకు రెండు పూటలా అన్నం పెడుతోంది. మోదీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టారు. ఇప్పుడు పేరు మార్చారు. రాబోయే రోజుల్లో ఈ పథకాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారు. అందరూ గ్రామ గ్రామానికి వెళ్లి మహాత్మా గాంధీ పేరు తొలగించే కుట్రలను ప్రజలకు తెలియజేయాలి' అని కాంగ్రెస్ శ్రేణులకు శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.





ఉపాధి హామీ పథకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. ఉపాధి హామీ పథకంపై బుల్డోజర్ నడిపారని ఆరోపించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానే కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ జీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజి రామ్ జి)బిల్లుకు ఇటీవల పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించింది.

దీనిపై సోనియాగాంధీ తొలిసారి స్పందించారు. మహాత్మాగాంధీ పేరును ఉద్దేశపూర్వకంగానే కేంద్రం తొలగించిందని, ఉపాధి హామీ పథకం రూపురేఖలను కుట్రపూరితకంగా మార్చేసిందని తప్పుపట్టారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా, భాగస్వాములతో సంప్రదింపులు జరపకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ఈ మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు. '20 ఏళ్ల క్రితం మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు ఎంజీఎన్ఆర్ఈజీఏను పార్లమెంటులో ఏకాభిప్రాయంతో ఆమోదించాం. ఈ పథకంతో పేదల ఉపాధికి చట్టపరమైన హక్కు కలిగింది. తద్వారా గ్రామీణ పంచాయతీలు బలపడడానికి దోహదపడింది. ఎంజీఎన్ఆర్ఈజీఏతో మహాత్మాగాంధీ కలన సాకారానికి పటిష్టమైన అడుగు వేశాం' అని సోనియాగాంధీ చెప్పారు. దేశంలోని కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై మోదీ ప్రభుత్వం దాడి జరిపిందని, గత 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని సోనియాగాంధీ విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏతో ఉపాధి వలసలకు కళ్లెం పడిందని, ఉపాధికి చట్టపరమైన హక్కు లభించిందని, గ్రామ పంచాయతీలు సాధికారత సాధించాయని చెప్పారు. అయితే ఎంజీఎన్ఆర్ఈజీఏపై ప్రభుత్వం ఇటీవల బుల్డోజర్ నడిపిందని, మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాకుండా హామీ పథకం రూపురేఖలనే మార్చేసిందని తప్పుపట్టారు. ఎవరినీ సంప్రదించకుండా, చర్చలు లేకుండా, విపక్షాలను ఖాతరు చేయకుండా కుట్రపూరితంగా ఈ మార్పులు చేసిందని అన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియాగాంధీ తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను తేవడం, అమలు చేయడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించదని, అయితే ఇది ఎన్నడూ పార్టీ అంశంగా తీసుకోలేదని, జాతీయ, ప్రజా ప్రయోజనాలతో సంబంధం కలిగిన స్కీమ్‌గానే తాము భావించామని చెప్పారు.

# పాకిస్థాన్ మాజీ ప్రధానికి 17 ఏళ్ల జైలు

**విశాలభారతి, ఇంటర్నేషనల్:**



తోషఖానా2 అవినీతి కేసులో పాకిస్థాన్ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎఫ్ఐఏ)కు చెందిన ప్రత్యేక కోర్టు శనివారం సంచలన తీర్పును వెలువరించింది. మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీలకు చెరో 17 ఏళ్ల జైలుశిక్షను న్యాయస్థానం విధించింది. 2021 మే నెలలో పాకిస్థాన్ పర్యటన సందర్భంగా నాటి ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ బుల్గారీకి చెందిన బంగారు ఆభరణాల సెట్‌ను బహూకరించారు. ఈవిధంగా ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులకు అందే గిఫ్టులు పాకిస్థాన్ ప్రభుత్వ తోషాఖానా విభాగానికి చేరుతాయి. అయితే ఇమ్రాన్ ఖాన్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఆ ఆభరణాల సెట్‌ను తక్కువ ధరకే తోషాఖానా నుంచి కొనేశారనే అభియోగంతో 2024 జులైలో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. తోషాఖానా నుంచి విలువైన చేతి గడియారాలు, వజ్ర ఆభరణాలు, బంగారు ఆభరణాలను కారు చౌకగా ఇమ్రాన్ ఖాన్ దంపతులు దక్కించుకున్నారనే అభియోగాలను మోపారు. ఇదే తోషఖానా2 అవినీతి కేసు. ఇందులో ఇమ్రాన్, బుష్రా బీబీ దోషులు అని తేలడంతో ప్రత్యేక ఎఫ్ఐఏ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ షారుఖ్ అర్జుమంద్ తాజా తీర్పును ఇచ్చారు. దీనిపై హైకోర్టులో అప్పీల్ చేస్తామని ఇమ్రాన్ ఖాన్ దంపతుల తరఫు న్యాయవాదులు ప్రకటించారు.

రావల్పిండి నగరంలోని అడియాలా జైలులోనే తోషఖానా2 అవినీతి కేసుకు సంబంధించిన వాదోపవాదనలన్నీ జరిగాయి. శనివారం ఉదయం అడియాలా జైలులో ప్రత్యేక కోర్టు జడ్జి ఎదుట ఇమ్రాన్, బుష్రా బీబీలను హాజరుపరిచారు. వారి ఎదుటే న్యాయమూర్తి తీర్పును చదివి వినిపించారు. వారిద్దరికి చెరో 17 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.1.64 కోట్లు చొప్పున జరిమానాను కూడా జడ్జి షారుఖ్ అర్జుమంద్ విధించారు. ప్రధానమంత్రి హోదాలో పాకిస్థాన్‌తో నేరపూరిత విశ్వాస ఘాతుకానికి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను, అధికారాన్ని దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడినందుకు మరో ఏడేళ్లను శిక్షను విధిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు 73 ఏళ్ల వయసులో ఉన్నందున, బుష్రా బీబీ మహిళ అయినందుకు దయాభావంతో వీలైనంత తక్కువ శిక్షనే విధించామని జడ్జి షారుఖ్ అర్జుమంద్ వ్యాఖ్యానించారు.

వాస్తవానికి తోషఖానా2 కేసులో 2024 అక్టోబరులో బుష్రా బీబీకి ఇస్లామాబాద్ హైకోర్టు బెయిలును మంజూరు చేసింది. ఈ కేసులోనే కొన్ని నెలల తర్వాత ఇమ్రాన్‌కు కూడా బెయిలు వచ్చింది. కానీ 2024 డిసెంబరులో ఈ కేసులో నేర దర్యాప్తునకు కోర్టు ఆదేశాలు జారీ అయ్యాయి. పలు ఇతరత్రా కేసుల్లోనూ నిందితులుగా ఉండటంతో ఇమ్రాన్ ఖాన్ దంపతులు రావల్పిండి నగరంలోని అడియాలా జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో జైలులోనే ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి, అక్కడే న్యాయవిచారణ జరిపించారు. ఈక్రమంలో అల్ ఖాదిర్ ట్రస్టు కేసులో 2025 సంవత్సరం జనవరి 17న మరో కోర్టు ముఖ్యమైన తీర్పు ఇచ్చింది. ఇమ్రాన్, బుష్రా బీబీ దోషులు అని తేల్చింది. ఇమ్రాన్‌కు 14 ఏళ్లు, బుష్రాకు ఏడేళ్ల జైలుశిక్షను విధించింది.

ఇక ఈ ఏడాది(2025) అక్టోబరులో ప్రత్యేక కోర్టులో తోషఖానా2 కేసుపై న్యాయ విచారణ జరిగింది. తమపై చేసిన అన్ని అభియోగాలను ఇమ్రాన్ ఖాన్ దంపతులు ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో తమపై ఆ కేసులు పెట్టారని తెలిపారు. పాకిస్థాన్ రాజకీయాల నుంచి తమను దూరం చేసేందుకే ఈ కుట్ర జరిగిందన్నారు. తోషాఖానా పాలసీ2018 ప్రకారమే తాను నిర్ణయాలను తీసుకున్నానని ఇమ్రాన్ తెలిపారు. పాకిస్థాన్ ఖజానాకు నిర్దిష్ట నగదును చెల్లించిన తర్వాతే ఆ గిఫ్టులను తాను తీసుకున్నానని ఆయన చెప్పారు. ఇవే వాదనలతో తదుపరిగా హైకోర్టు తలుపులను ఇమ్రాన్ దంపతులు తట్టనున్నారు.

అయితే ఇదంతా రాజకీయ కక్షతోనే కేసుల ఉచ్చు బిగించారని ఇమ్రాన్‌ఖాన్ మద్దతుదారులు అంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పటికీ పాకిస్తాన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుల్లో ఒకరని, జైల్లో ఉన్నా ఆయన పేరు రాజకీయంగా మార్మోగుతూనే ఉందంటున్నారు. యువతలో ఇమ్రాన్ ప్రభావం కొనసాగుతుండటం అధికార వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అందుకే ఆయనపై వరుసగా కేసులు విధించి, శిక్షలు పడేలా చేస్తున్నారంటున్నారు ఇమ్రాన్ ఖాన్ సపోర్టర్స్. వారం కిందట ఇమ్రాన్ ఖాన్ కుమారులు కూడా తమ తండ్రిని జీవితాంతం జైల్లోనే పెడతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తోషాఖానా కేసే కాదు, ఇమ్రాన్‌ఖాన్‌పై డజన్ల సంఖ్యలో కేసులు ఉన్నాయి..

ఇమ్రాన్‌పై నమోదు చేయబడ్డ కేసుల్లో అక్రమ ఆస్తుల వ్యవహారం, అధికార దుర్వినియోగం వంటి కేసులు ప్రధానమైనవి. ప్రభుత్వ నమ్మకానికి ద్రోహం చేశారన్న అభియోగాలు ఉన్నాయి. ఉగ్రవాద నిరోధక చట్టం కింద కూడా కేసులు నమోదయ్యాయి. అంతేకాదు ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, సీక్రెట్‌గా ఉంచాల్సిన దౌత్య పత్రాలను బహిర్గతం చేశారన్న ఆరోపణలతో 'సైఫర్ కేసు' కూడా ఫైల్ అయింది. కొన్ని కేసుల్లో మొత్తంగా 30 - 40 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. అన్ని కేసుల్లో శిక్షలు పడితే జీవితకాలం జైలులోనే ఉండాల్సిందే..!

ఇదిలావుంటే, ఇమ్రాన్‌ఖాన్ తనపై నమోదైన కేసులన్నీ ఖండిస్తూ వస్తున్నారు. తనను పూర్తిగా రాజకీయంగా అణిచి వేసేందుకు జరిగిన కుట్రలో భాగమే అంటున్నారు. గతంలోనూ అనేకమంది రాజకీయ నేతలు కోర్టుల ద్వారా శిక్షలు ఎదుర్కొన్న ఉదాహరణలు ఉన్నాయి. అయితే, ఇమ్రాన్ ఖాన్ విషయంలో కేసుల సంఖ్య, తీవ్రత, సమయపాలన అన్నీ కలిసి చూస్తే అంతా ప్లాన్డ్‌గా జరుగుతున్నదేనని ఇమ్రాన్‌ఖాన్ మద్దతు దారులు చెబుతున్నారు.

# 18 మంది ఎమ్మెల్యేలకు సీఎం వార్నింగ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ బీ.మహేష్ కుమార్ గౌడ్ లు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీక్షా వివరాలను మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించడంలో విఫలమైన వరంగల్, మహబూనగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన 18మంది ఎమ్మెల్యేలు, పలువురు నియోజక వర్గ ఇన్ చార్జ్‌లపై ఈ సందర్భంగా సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లుగా తెలుస్తున్నది. సర్పంచ్ ఎన్నికల ఫలితాలకు సంబంధించి 18 మంది ఎమ్మెల్యేల పనితీరుపై పీసీసీ అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎన్నికల సందర్భంగా రెబల్స్‌ను బుజ్జగించకపోవడం.. సొంత బంధువులకు టికెట్ ఇచ్చి పార్టీకి నష్టం చేశారంటూ సీరియస్ అయినట్టు తెలిసింది. భవిష్యత్‌లో ఇది రిపీట్ అయితే ఉరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి వారికి వార్నింగ్ ఇచ్చినట్లుగా సమాచారం. ఎమ్మెల్యేల పనితీరుపై దాదాపు రెండు, మూడు రోజులుగా సమీక్ష జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో మూడు విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సింహ భాగం సర్పంచ్ స్థానాలను సాధించి జయకేతనం ఎగురవేసింది. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఒక్క సిద్దిపేట జిల్లా మినహా మిగిలిన 30 జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,702 పంచాయతీ సర్పంచి పదవులకు గాను.. తుది లెక్కల ప్రకారం కాంగ్రెస్ 8,335 స్థానాల్లో గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ మద్దతుదారులు మొత్తం 3,511 స్థానాలను గెలుచుకోగా, బీజేపీ 710 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి కీలక జిల్లాల్లో మంచి ఫలితాలు సాధించింది.

తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు సాధించినా.. తుది ఫలితాల పైన మాత్రం సమీక్ష చేస్తున్నారు. తమకు వచ్చిన సీట్ల పైన బీఆర్ఎస్ నేతలు హ్యాపీగానే ఉన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పైన వ్యతిరేకత స్పష్టంగా ఫలితాల్లో కనిపించిందని చెబుతున్నారు. ఇదే సమయంలో తెలంగాణలో మరో ఎన్నికల సమరానికి ముహూర్తం దాదాపు ఖరారైంది. ఇక.. ఈ ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. 2028 ఎన్నికలకు సెమీ ఫైనల్స్ గా నిలవనున్నాయి.

రేవంత్ సర్కార్ మరో ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. మునిసిపల్ ఎన్నికలనూ నిర్వహించాలని యోచిస్తోంది. అన్నీ కుదిరితే.. జనవరిలోనే మునిసిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, పార్టీ పరంగా జరిగే మునిసిపల్ ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న అంశంపై కసరత్తు చేస్తోంది. వాస్తవనికి పంచాయతీ ఎన్నికల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నించింది.

# జగన్ బర్త్ డే.. జనంలోకి కేసీఆర్





( మొదటిపేజీ తరువాయి )

మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళనలపైనా కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. చాలా రోజుల తర్వాత తమ అధినేత తెలంగాణ భవన్‌కు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

అయితే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఏపీకి చెందిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ కూ, తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్‌కు ఉన్న బంధం అందరికీ తెలిసిందే. గతంలో జగన్ సీఎం కాకముందు నుంచే అప్పటి టీఆర్ఎస్‌తో వైసీపీ బంధం కొనసాగేది. ఆ తర్వాత జగన్ అధికారంలోకి వచ్చాక కూడా కేసీఆర్, కేటీఆర్‌తో కలిసి నడిచారు. అయితే మధ్యలో కాస్త గ్యాప్ వచ్చినా తాజాగా కేటీఆర్‌తో జగన్ ప్రైవేట్ కార్యక్రమంలో కనిపించారు కూడా.

ఈ నేపథ్యంలో ఈరోజు పుట్టినరోజు జరుపుకునేందుకు వైఎస్ జగన్ సిద్ధమవుతున్నారు. ఇలాంటి తరుణంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం కమ్ జగన్ నివాసం ముందు భారీ కటౌట్లు దర్శనమిస్తున్నాయి. తెలంగాణలోని బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ లు జగన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నట్లుగా ఈ పోస్టర్లు ఉన్నాయి. వైఎస్ జగన్‌తో కేసీఆర్, కేటీఆర్ బంధాన్ని గుర్తుచేసేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు వైసీపీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. అదే సమయంలో వైసీపీ కేంద్ర కార్యాలయం సహా మరికొన్ని చోట్ల కేసీఆర్, కేటీఆర్ భారీ కటౌట్లు ఏర్పాట్లు చేసి ముందుగానే శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణకు చెందిన కొందరు నేతలు వీటిని ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లికి చెందిన డాక్టర రవీందర్ పేరుతో ఈ భారీ కటౌట్ లు వెలిశాయి. తాడేపల్లిలో తిరిగే వారిని ఈ కటౌట్లు ఆకర్షిస్తున్నాయి. తాజాగా జగన్ హైదరాబాద్ టూర్ లోనూ అక్కడి బీఆర్ఎస్ నేతలు జనసమీకరణ చేశారు. ఇప్పుడు జగన్ ఇంటివరకూ ఈ అభిమానం వచ్చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. ఇక అసలు విషయానికి వస్తే 'బీఆర్ఎస్ ప్రభుత్వమే తిరిగి వచ్చి ఉంటే ఈపాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందేవి. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజల, రైతాంగ ప్రయోజనాలు కాపాడబడేవి. కానీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు పాలమూరు ప్రాజెక్టుపై పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నది. బీఆర్ఎస్ 90 శాతం పనులు పూర్తిచేయగా, మిగిలిన 10 శాతం పనులు చేయకపోవడంతో మూడు జిల్లాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండేండ్లు గడిచినా రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంకా తెలంగాణ సమాజం మౌనం వహించజాలదు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కృష్ణా జలాల్లో కేవలం 45 టీఎంసీలకు ఒప్పుకోవడం క్షమించరాని ఘోరం. సాగునీటి అంశంలో తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ రాజీ పడబోదు' అని కేసీఆర్ స్పష్టంచేశారు. ఇలాంటి కీలక సమయంలో నీటి కేటాయింపులు, ఏపీ జలదోపిడీ వంటి విషయాలతోపాటు, పార్టీ సంస్థాగత నిర్మాణ విషయాలు సహా పలు అంశాలను రేపు జరిగే సంయుక్త సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన కూలంకషంగా చర్చ జరగనున్నది. అందుకు అనుగుణంగా చేపట్టబోయే ప్రజా ఉద్యమాల నిర్మాణం, అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక నిర్ణయాలు ఉంటాయి. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, జలాల కేటాయింపు, కృష్ణా, గోదావరి జలాల విషయంలో ఏపీ జలదోపిడీపైన పోరాడేందుకు ఒక ఉద్యమ స్వరూపానికి ఈ సమావేశంలో బీజం పడనున్నది. 'పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 91 టీఎంసీలు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలని కేంద్రం ఎదుట దేబరించడం బాధాకరం. 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మోకరిల్లి రావడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేయడమే. రాష్ట్రానికి, ముఖ్యంగా పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఒకరూ మాట్లాడిన పాపాన పోవట్లేదు. బీజేపీయే తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు గండి కొడుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది. రాష్ట్రానికి సాగునీటి పథకాల విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని, కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి సహకరిస్తున్న కేంద్రం విధానాన్ని ఎదురోవాలంటే తెలంగాణ సమాజానికి మరోసారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యం' అని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.

# రేవంత్ ప్రభుత్వానికి హనీమూన్ ముగిసింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంద్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..' రేవంత్.. ఎవరితో ఫుట్ బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు. నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్ బాల్ ఆడుకుంటాను. రేవంత్ ఇంట్లోని మహిళలను, పిల్లలను, మనుమడి గురించి నేను మాట్లాడను.



రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయను. రేవంత్ రెడ్డి సర్కార్‌కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు కేసీఆర్ ఆదివారం అన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక 32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేకు ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది.ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము. ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరు?.

అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకు?. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్రరావు చెప్పాలి. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండింగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# ఉపాధిని కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

- ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లు పై ఆగ్రహం
- జి రామ్ జి ఉపాధి బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి
- బిల్లు ప్రతులు దగ్ధం చేసి నిరసన తెలియజేసిన సిపిఎం




**భద్రాచలం, విశాలభారతి:** కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో జి రామ్ జి ఉపాధి బిల్లును ప్రవేశపెట్టింది. వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రంగా నష్టం చేసే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అంగ బలంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుచేసి ఆ స్థానంలో జి రాంజీ ఉపాధి బిల్లును తీసుకురావడం జరిగిందని ఇది దేశంలోని వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు తీవ్ర నష్టమని అన్నారు. పాత బిల్లుకు సంబంధించి మహాత్మా గాంధీ పేరు మాత్రమే మారుస్తున్నామని ఇది మెరుగైనటువంటి బిల్లు అని 100 రోజుల పని 125 రోజులు పెంచుతున్నామని ఎన్ డి ఏ పార్లమెంటులో వాదించడం దుర్మార్గమని అన్నారు. కోట్లాదిమంది గ్రామీణ వ్యవసాయ కార్మికులు ఇతర పేదలకు భరోసాగా ఉన్న 100 రోజులు పని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేయాలని ఆలోచన బిజెపి ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చిందని ఈ ఆలోచన తుది రూపం జి రామ్ జి బిల్లు ద్వారా ఈరోజు ఇచ్చిందని అన్నారు. జి రామ్ జి బిల్లు ద్వారా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాస్త పథకం రూపంలోకి మార్పు చేశారని వారు విమర్శించారు. రానున్న కాలంలో గ్రామీణ పేదలు పనిని హక్కుగా పొందే అవకాశం ఉండదని అన్నారు. జి రాంజీ ఉపాధి బిల్లులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 40 శాతం రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించాలని పేర్కొనటం ఉపాధి చట్టాన్ని నీరుగార్చటమే అన్నారు. దీనివల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యల మీదనే ఈ పథకం అమలు కావడానికి అవకాశం ఉందని విమర్శించారు. పని ప్రదేశాలలో యంత్రాల వినియోగం పై ఉన్న నిషేధాన్ని కూడా ఈ బిల్లులో ఎత్తివేశారని, ఇది కాంట్రాక్టర్లకు అనుకూలమైన నిర్ణయం అని అన్నారు. 2004 లో సిపిఎం వామపక్ష పార్టీల సపోర్టుతో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వంపై వత్తిడి చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సిపిఎం వామపక్ష పార్టీలు తీసుకువచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు ఎన్ నాగరాజు,యు జ్యోతి,అజయ్ కుమార్, కుంజ శ్రీనివాస్, ఎస్ ఉపేంద్ర,కోరాడ శ్రీనివాస్,ఏ. రత్నం, చుక్కా మాధవరావు కొలగాని రమేష్, రాఘవయ్య, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ శాఖ కార్యదర్శి దుర్గారావు, సీత, ఎస్ఎఫ్ఐ నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మోయినాబాద్‌లో మ్యాథమెటిక్స్ ట్యాలెంట్ టెస్ట్–2025

**మోయినాబాద్, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో గణిత ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా శనివారం మ్యాథమెటిక్స్ ట్యాలెంట్ టెస్ట్-2025 ను నిర్వహించారు. జిల్లాలోని 27 మండలాల్లో ఒకేసారి నిర్వహించిన ఈ పరీక్షలో భాగంగా, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని కేజీబీవీ, గురుకుల, జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి మొత్తం 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్ష అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి, ఈ నెల 30వ తేదీన హయత్‌నగర్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హత కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం విభాగంలో జి. దివ్య తేజ (చిన్నమంగళారం) ప్రథమ స్థానం, జే. స్వాతి (మేడిపల్లి) ద్వితీయ స్థానం, కే. మహేష్ (అజీజ్‌నగర్) తృతీయ స్థానం సాధించారు. తెలుగు మీడియం విభాగంలో శరణ్య (కేతిరెడ్డిపల్లి) ప్రథమ స్థానం, టి. శ్రవంతి (కేతిరెడ్డిపల్లి) ద్వితీయ స్థానం, జే. శాలిని (కేతిరెడ్డిపల్లి) తృతీయ స్థానం సాధించారు. రెసిడెన్షియల్ (సాంఘిక సంక్షేమ గురుకుల) పాఠశాలల విభాగంలో పి. భవ్యశ్రీ (టీజీఎంఆర్ఎస్, మొయినాబాద్) ప్రథమ స్థానం, వి. దివ్య (టీజీఎంఆర్ఎస్, మొయినాబాద్) ద్వితీయ స్థానం, నిషత్‌బేగం (టీజీఎంఆర్ఎస్, మొయినాబాద్) తృతీయ స్థానం సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రవీందర్, కోశాధికారి సరిత, సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో ప్రావీణ్యం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



# కేఎల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ ఏఐ సదస్సు



**మోయినాబాద్, విశాలభారతి:** భవిష్యత్తులో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మానవ జీవితంపై విస్తృత ప్రభావం చూపబోతుందని, ఆ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని కోనేరు లక్ష్మణ్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ కోనేరు లక్ష్మణ్ హవీష్ అన్నారు. మోయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ రెవెన్యూలో ఉన్న కేఎల్ఎమ్ డీమ్డ్ యూనివర్సిటీలో గత రెండు రోజులుగా "ఏఐ ఆధారిత సాంకేతికతల్లో తాజా ధోరణులు" అనే అంశంపై నిర్వహించిన మూడవ అంతర్జాతీయ సదస్సు థింక్ ఐ-2025 ఘనంగా ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ సదస్సులో పరిశోధన మరియు ఆవిష్కరణలపై విస్తృత చర్చలు జరిగాయి. భారత్‌తో పాటు విదేశాల నుంచి ప్రముఖ అకాడమిషియన్లు, పరిశ్రమ నిపుణులు, వ్యాపారవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాథమిక పరిశోధనలతో పాటు అనువర్తిత ఏఐ ఆవిష్కరణలపై లోతైన విశ్లేషణలు జరిపారు. సదస్సులో మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, స్పీచ్ & సిగ్నల్ ప్రాసెసింగ్, సాఫ్ట్ కంప్యూటింగ్, ఏఐ ఆధారిత అనలిటిక్స్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, హెల్త్‌కేర్ మరియు స్మార్ట్ సిటీల్లో ఏఐ వినియోగం, నైతిక మరియు బాధ్యతాయుత ఏఐ వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ బి. యోగ్యనారాయణ, జోయిర్ ఎర్త్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ అమిత్ వర్మ, డాక్టర్ సుబ్రజిత్ సతపథి, డాక్టర్ ఎస్‌కే అల్తాఫ్, డాక్టర్ కృష్ణయ్య తదితరులు పాల్గొని కీలక అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కోనేరు లక్ష్మణ్ హవీష్, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా ఏఐ అభివృద్ధిని దిశానిర్దేశం చేయడంలో విద్యా సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు ఇక భవిష్యత్తు కాన్సెప్ట్ మాత్రమే కాదని, ప్రస్తుతం మన జీవితాలను ప్రభావితం చేస్తోందని, రాబోయే మార్పులను కూడా నిర్వచిస్తుందని తెలిపారు. థింక్ ఐ వంటి వేదికల ద్వారా పరిశోధన ఆధారిత ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడం, నైతికంగా మరియు పరిశ్రమలకు అనుకూలంగా ఉండే ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయగల విద్యార్థులను తీర్చిదిద్దడమే కేఎల్ యూనివర్సిటీ లక్ష్యమని వెల్లడించారు.

# గ్రామీణ ఉపాధికి ఇంధనంగా 'వికసిత్ భారత్ జీ రామ్ జి' చట్టం

**బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 70 శాతానికి పైగా ప్రజలకు ఉపాధి అవకాశాలను మరింత విస్తరించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక(గ్రామీణ)' (వీబీజీఆర్ఏఎంజీ) బిల్లు దేశాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు.గతంలో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచడం ద్వారా గ్రామీణ కార్మికులకు భరోసా కల్పించడమే ఈ బిల్లులోని ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 2005లో ఈ పథకం ప్రవేశపెట్టినప్పుడు మహాత్మా గాంధీ పేరు లేకపోయినా, 2009 పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం మహాత్ముడి పేరును వాడుకున్న కాంగ్రెస్ పార్టీ నేడు మొసలి కన్నీళ్లు కారుస్తోందని ఆరోపించారు.పథకం ప్రారంభ సమయంలో రోజువారీ వేతనం రూ.127గా ఉండగా, దాన్ని రూ.300 వరకు పెంచిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని చెప్పారు. యూపీఏ హయాంలో పదేళ్ల కాలంలో కేవలం రూ.2.13 లక్షల కోట్ల కేటాయింపులు మాత్రమే ఉండగా, 2014 నుంచి 2025 వరకు మోదీ ప్రభుత్వంలో ఈ పథకానికి రూ.7.80 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించారని వివరించారు.గత కాంగ్రెస్ పాలనలో ఈ పథకం పేరుతో అనేక అక్రమాలు జరిగాయని, కోట్లాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయని విమర్శించారు. దీనికి భిన్నంగా మోదీ ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లోకి ఏడు రోజులలోపే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా సొమ్ము జమ చేసే సంస్కరణను తీసుకువచ్చి పారదర్శకత పెంచిందని అన్నారు. ఈ చట్టం కింద జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయతీల స్థాయిలో స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండటంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో దృఢమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

# దోసపాటి పిచ్చే శ్వరరావు ఔదార్యం

- రోడ్డు ప్రమాద బాధితుకి ఆర్థిక సాయం
- దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత దోసపాటి పిచ్చే శ్వరరావు అందజేత

**అశ్వాపురం, విశాలభారతి:** అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత దోసపాటి పిచ్చే శ్వరరావు రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని మిట్ట గూడెం గ్రామపంచాయతీలో గల గోపాలపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి ఓ వాహన ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దోసపాటి పిచ్చేశ్వరరావు శనివారం అతడి స్వగృహానికి వెళ్లి ప్రమాద బాధితుడి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని, కొంత ఆర్థిక సాయాన్ని అందజేశాడు. ఆయన వెంట గడుపుడి పద్మ నర్రా శ్రీనివాస్ ఉన్నారు.

**చేయూతనందించడంలో మేటి...దోస పాటి**

ఆపదలో ఉన్నవారికి చేయూతను అందించడంలో మేటి...దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు దోసపాటి పిచ్చే శ్వరరావు అని పలువురు ప్రశంసిస్తున్నారు. ట్రస్టు నెలకొల్పిన దగ్గర నుండి ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన నేనున్నానంటూ చేయూతని అందించడంలో ఆయనకు ఆయనే చాటని పలువురు అంటున్నారు. బాధితులు చెప్పకపోయినా ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరిగిన ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఆయనే స్వయంగా తెలుసుకొని వారికి అవసరం ఆయిన మేరకు సహాయ సహకారాలు అందించడంలో ఈ ట్రస్ట్ కు గొప్ప పేరు ప్రక్రియలు ఉన్నయనడంలో సందేహం లేదు.



# ఓటును శాసించిన నోటు

- పంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలకే పై చేయి
- గెలుపు కోసం లక్షల్లో ఖర్చు చేసిన అభ్యర్థులు
- అంత ధనవ్యయం చేసింది ఏం ఆశించో అర్థం కాని వైనం
- ఓట్లకు నోట్ల పంపకాన్ని అడ్డుకోలేక పోయిన సర్కార్



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** గ్రామపంచాయతీ ఎన్నికలలో నూటికి నూరు శాతం ఓటును నోట్లు శాసించాయని స్పష్టంగా తేటతెల్లమవుతోంది. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఈసీ ఆంక్షలు పోటీలో ఉన్న అభ్యర్థులు ఆ పార్టీలా మద్దతుదారుల ముందు ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా వాటిని కట్టడి చేసేందుకు ప్రధాన రోడ్లపై ఎక్కడికక్కడ పోలీస్ చెక్ పోస్టులు, ఎన్నికల అధికారులు, వారు ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు స్థానికంలో పచ్చ నోట్ల ప్రభావం లేకుండా ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అడ్డుకట్ట వేయలేకపోయాయి. వెరసి గ్రామపంచాయతీ ఎన్నికలు మునుపెన్నడూ లేని విధంగా ధన ప్రవాహం నడుమ కొనసాగటం ఆశ్చర్యానికి గురిచేసింది. అభ్యర్థులు గెలుపు కోసం లక్షలాది రూపాయలను విరజల్లి గెలుపు తీరాలను చేరుకునేందుకు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు.

**గ్రామపంచాయతీ కుర్చీ కైవసం చేసుకునేందుకు లక్షల ఖర్చు చేసిన అభ్యర్థులు :**

ఈనెల 11వ తేదీ నుండి జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు ఆషామాషీగా జరిగిన ఎన్నికల కాదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి స్థానిక సింహాసనమును కైవసం చేసుకున్న ఎన్నికలు. సాధారణంగా ప్రజలందరి పరిపాలన సౌలభ్యత కోసం స్థానికంగా ఎన్నుకోవలసిన నాయకులను ప్రజలు, వారి బాగోగులు చూసి, గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే వారిని ఎన్నుకోవాల్సి ఉన్నప్పటికీ ఓటర్లు ప్రలోభాలకు, పచ్చ నోట్లకు ఆశపడి అధికంగా ఖర్చు చేసిన వారిని అందలమెక్కించారని విశ్లేషకులు చెప్పకనే చెప్తున్నారు. గ్రామపంచాయతీలను కైవసం చేసుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్నవారికి కాస్త మేజర్ పంచాయతీ అయితే రూ. 30 నుండి 40 లక్షలు, ఓ మాదిరి జనాభా కలిగి ఉన్న పంచాయితీ అయితే రూ. 15 నుండి 20 లక్షలు, మరి కాస్త చిరు పంచాయతీలు అయితే తక్కువలో తక్కువ రూ. 7.50 నుండి 10 లక్షల వరకు ఆ పంచాయతీలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితులను బట్టి సర్పంచ్ పదవుల కోసం ఖర్చు చేసి విజయ బావుట ఎగురవేసి సర్పంచ్ కుర్చీపై ఆశీనులయ్యేందుకు సంసిద్ధులయ్యారని మేధావి వర్గానికి చెందిన వారు అంటున్నారు.

**ఎన్నికల్లో నోట్ల పంపకాన్ని ఆపలేకపోయిన సర్కార్ :**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు లక్షలాది రూపాయలు చేతులు మారాయి. నోట్ల పంపకాన్ని సర్కారు కానీ ఎన్నికల కమిషన్ కానీ అడ్డుకోలేకపోయింది. ఏ పంచాయతీలో చూసిన అభ్యర్థుల తరఫున ప్రచారాలు నిర్వహించిన పార్టీల మద్దతుదారులు, కార్యకర్తల చేతుల్లో నోట్ల కట్టలు చిత్తుకాగితల్లా తిరిగాయి. ఓటర్లను ఏ స్థాయిలో ప్రలోభాలకు గురిచేస్తే వారిని వశం చేసుకోవచ్చో ముందుగానే పథకం రసించుకున్న నాయకులు పచ్చ నోట్లను వెదజల్లి గెలుపు కోసం ఆరాటపడ్డారు. అందినకాడల్లా డబ్బులు తెచ్చి విచ్చలవిడిగా పంచిపెట్టారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల్లో డబ్బులు పంచకుండా అడ్డుకోవడంలో ఎలక్షన్ కమిషన్ తో పాటు సర్కార్ కూడా పూర్తిగా విఫలమైందని విశ్లేషకులు అంటున్నారు. మునుపెన్నడూ లేని రీతిలో ఇలా ఎన్నికలకు అంతుచిక్కనన్ని డబ్బులు విరజల్లి అభ్యర్థులు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తే మునుముందు జరిగే ఎన్నికల్లో ఆస్తిపాస్తులు లేని సామాన్యులు పోటీల్లో నిలవాలంటే అసాధ్యమైన పనని కొన్ని వర్గాల వారు అంటున్నారు. నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవలసిన ఓటర్లను ఇలా ప్రలోభాలకు గురిచేస్తే వారు నీతి, నిజాయితీపరులైన సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవడం ఎలా సాధ్యపడుతుందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేసి, ప్రజలు వారిని పాలించే నాయకున్ని నిజాయితితో ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రభుత్వాలు, ఎలక్షన్ కమిషన్లు దృష్టి సారించాలని అనేకమంది కోరుతున్నారు.

## నజ్దిక్ సింగారం ఉపసర్పంచ్ గా వన్నవాడ రవీందర్ రెడ్డి

- గ్రామ అభివృద్ధిలో భాగమవుతాం
- గ్రామంలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తాం
- రవీందర్ రెడ్డి వెల్లడి



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నజ్దిక్ సింగారం గ్రామ ఉప సర్పంచ్ గా వన్నవాడ రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికలలో భాగంగా రవీందర్ రెడ్డి నజ్దిక్ సింగారం గ్రామంలో 8వ వార్డులో వార్డు సభ్యునిగా పోటీ చేసి సమీప ప్రత్యర్థి పై విజయం సాధించాడు. అనంతరం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నికపై వార్డు సభ్యులు రవీందర్ రెడ్డి కి సానుకూలంగా మద్దతు ఇచ్చారు. దీంతో సింగారం ఉప సర్పంచ్ గా బిజెపి పార్టీ కి చెందిన వన్నవాడ రవీందర్ రెడ్డి నీ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ఎన్నికల ధ్రువపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ .. గ్రామ అభివృద్ధిలో తాను కీలకంగా పనిచేస్తానని అన్నారు. గ్రామంలో కావాల్సిన మౌలిక సదుపాయాలు పాలకవర్గంతో కలిసి గ్రామ అభివృద్ధిలో భాగం పంచుకుంటామన్నారు. రవీందర్ ఎన్నికపై బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రేపు పాలకవర్గం ప్రమాణ స్వీకారం గ్రామపంచాయతీలో ఉంటుందని తెలిపారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన సర్పంచ్ జక్క రవీందర్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని గండిచెరువు గ్రామ పంచాయతీ నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ జక్క రవీందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించారు. గండిచెరువు గ్రామ ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని కోరారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల చారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్యకు కృషి నెమలి అనిల్ కుమార్



**నాచారం, విశాలభారతి:** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ లో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం కోసం గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మల్లాపూర్ జలమండలి అధికారి ఏ.ఈ సిరాజ్ తో కలిసి కే.ఎల్.రెడ్డి నగర్ కాలనీ,భవాని నగర్ కాలనీ, హెచ్ సి ఎల్ కాలనీలలో పర్యటించడం జరిగింది,నీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీస్కొని అతి త్వరలో పరిష్కరించే విధంగా ప్రత్యేక ప్రణాలికను సిద్ధం చేయాలనీ ఈ సందర్బంగా ఏ.ఈ ని నెమలి అనిల్ కుమార్ కోరడం జరిగింది,ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్,సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్ ,కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,లైన్ మెన్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముదిరాజుల జండా ఆవిష్కరణ



**కూకట్ పల్లి, విశాలభారతి:** బాలానగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మీసేవ ముదిరాజ్ బస్తీలో ముదిరాజ్ జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ కుల సంఘం పెద్దలందరూ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం బాలనగర్ అధ్యక్షుడు ఆకుల నరేందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలలో అత్యధికంగా జనాభా కలిగిన ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, రానున్న గ్రేటర్ ఎన్నికల్లో ముదిరాజులకు జనాభా ప్రాతిపదికన టికెట్లు కేటాయించాలని, ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ముదిరాజుల సత్తా ఏంటో చూపిస్తామని ఆకుల నరేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో అవకాశం కల్పించండి

**కేటీఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ లీడర్ తిరుమలేష్**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి, సిరిసిల్ల శాసనసభ్యుడు తారకరామారావును శనివారం నంది నగర్ లో బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకర్గ సీనియర్ నాయకుడు గుర్ల తిరుమలేష్ మర్యాదపూర్వకంగా కలిసి శబరిమల అయ్యప్ప ప్రసాదం అందజేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం,నల్లకుంట తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచి గెలిచిన వార్డు సభ్యుడు బానోతు రాజు,బిఆర్ఎస్ నాయకుడు సురేష్ పాలకుర్తి మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి ఝాన్సీరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్త పాత తేడా లేకుండా పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మబ్బు నిద్రలో జిహెచ్ఎంసి అధికారులు

- రోడ్లు గుంతలమయం.. ప్రజల జీవితం అస్తవ్యస్తం
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ధ్వజం




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** వనస్థలిపురం రైతు బజార్ ప్రధాన రోడ్డు మార్గంలో జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. సుమారు 15 రోజుల క్రితం రోడ్డు పునర్నిర్మాణం పేరుతో త్రవ్వి వదిలేసిన అధికారులు, ఆ తర్వాత పనులే ప్రారంభించకపోవడం వల్ల వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని నిరసిస్తూ శనివారం హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో వాణిజ్యదారులతో కలిసి సుష్మా చౌరస్తా నుంచి వనస్థలిపురం రైతు బజార్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రధాన రహదారిని త్రవ్వి అలాగే వదిలేయడం జిహెచ్ఎంసి అధికారుల అతి దారుణమైన నిర్లక్ష్యానికి నిదర్శనం. రోడ్డు పరిస్థితి పూర్తిగా శోచనీయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యాపారుల జీవనాధారం దెబ్బతింటోంది అని తీవ్రంగా మండిపడ్డారు. అదే విధంగా, భారీ వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న హయత్‌నగర్-ఇంజాపూర్ రోడ్ ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ రహదారి మీదుగా ప్రయాణించే వాహనాలు తరచూ చెడిపోవడం, ఎగిసే దుమ్ముతో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రెండు రహదారులు నాగార్జునసాగర్ హైవేకు అనుసంధానమైన కీలక సర్వీస్ రోడ్లని, రోజుకు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం అంటే ప్రజలపై భారం మోపినట్లేనని విమర్శించారు.ప్రజల కష్టాలను అధికారులు ఇప్పటికైనా గుర్తించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెంటనే వనస్థలిపురం రైతు బజార్ రోడ్డు,హయత్‌నగర్-ఇంజాపూర్ రోడ్ల పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని జిహెచ్ఎంసి అధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రభారి సామ రంగారెడ్డి, బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు నూతి శ్రీనివాస్, వనస్థలిపురం బీజేపీ డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్ వార్డ్ మెంబర్లకు సన్మానం

- ప్రజలే మన బలం, బలగం. ఎమ్మెల్యే పాయం
- ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచులకు బంపర్ ఆఫర్లు
- సర్పంచులు అధైర్య పడొద్దు అండగా ఉంటా



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు సారపాక పుష్కర వనంలో ఏర్పాటుచేసిన నూతన సర్పంచు వార్డు మెంబర్ల సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 18 గ్రామ పంచాయతీలకు గాను 13 గ్రామ పంచాయతీలు కాంగ్రెస్ విజయం సాధించినట్లు వెల్లడించారు. అందులో 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. ఓడిన 5 గ్రామపంచాయతీ స్థానాలు మండల కాంగ్రెస్ నాయకుల వర్గపోరు కారణంగా ఓడినట్లు తెలుపుతూ ఆ నమ్మక ద్రోహులపై కాంగ్రెస్ పార్టీ పరమైన చర్యలు తప్పవని ఘాటుగా వ్యాఖ్యానించారు. అనంతరం గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్ లను సన్మానించారు. సర్పంచ్ అంటే గ్రామ ప్రథమ పౌరుడిగా అధికారాలు ప్రజలు కట్టబెట్టారని వారి ఆశలను అడియాశలు చేయకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ సర్పంచ్ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసే బాధ్యత ఎమ్మెల్యేగా నేను ముందుండి గ్రామపంచాయతీ సర్పంచులకు నిధులు సమకూర్చడంలో తన వంతు కృషి ఉంటుందని అన్నారు. బూర్గంపాడు మండల వ్యాప్తంగా సుమారు 7 వందల ఇందిరమ్మ ఇల్లులు మొదటి విడతలో మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో వాటిని రెట్టింపు చేసి 14 వందల ఇందిరమ్మ ఇల్లులు బూర్గంపాడు మండల వ్యాప్తంగా మంజూరు చేస్తానని ఈ సందర్భంగా నూతన సర్పంచులకు హామీ ఇచ్చారు. మేజర్ గ్రామపంచాయతిలైన సారపాక,బూర్గంపాడు మంచి మెజారిటీతో గెలవడంతో ఆ సర్పంచులను కొనియాడారు. రేపు జరగబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో అన్ని స్థానాలు అత్యధిక మెజార్టీ తో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపొందే దిశగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు.


## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి

- మండల విద్యాధికారి మల్లయ్య



**మొయినాబాద్, విశాలభారతి:** విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత నైపుణ్యతను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మండల విద్యాధికారి మల్లయ్య అన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చాలెంజర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో కార్నివల్ కార్యక్రమం హట్టహసంగా జరిగింది. ముందుగా మండల విద్యాధికారి మల్లయ్య సహాయత ట్రస్ట్ సభ్యులు రిబ్బన్ కట్ చేసి కార్నివల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహిస్తున్న యాక్టివిటీస్ విద్యార్థి తల్లిదండ్రులను ట్రస్ట్ సభ్యులను ఆనందపరిచాయి. ముఖ్యంగా విద్యార్థులలో ఉన్న నైపుణ్యతను వెలికి తీసి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల విద్యాధికారి మల్లయ్య అభినందించారు. అనంతరం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నింపుకొని కష్టపడి చదివి తమ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు.

## మట్టిలో మాణిక్యాలు మా పల్లె పిల్లలు




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామ హరిజన కాలనీ లో గల ప్రాథమిక పాఠశాల లో ఈరోజు పోషకాహారోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అంజయ్య బాస్కుల గారి ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఉపాధ్యాయుడు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రోజువారీ ఆహారంలో పిల్లలకు పోషక సమతులహారం అందిస్తే, పౌష్టిక విలువలు సమపాళ్ళలో ఉండి రోగనిరోధక శక్తి పెరిగి పిల్లలు ఆరోగ్యకరమైన బాల్యాన్ని అనుభవిస్తూ చురుకుగా చదువుతారు. స్థానికంగా లభించే ఆహర పదార్థాలలో కూడా ఎన్నో పోషక విలువలు ఉంటాయని వాటిని పిల్లలకు అందించేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. రోజువారి ఆహారంలో ఫైబర్ రిచ్ కార్బోహైడ్రేట్స్25శాతం, ప్రోటీన్స్25శాతం, పాలపదార్థాలు 10శాతం, పండ్లుకూరగాయలు 40శాతం ఉండేలా చూసుకోవాలని తెలియజేసారు. ఈ సందర్భంగా పిల్లల ప్రతిభను పరీక్షించగా చదువులో, చేతివ్రాతలో చక్కటి ప్రతిభను కనపరుస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మోక్ష, శ్రీరామ్,సారిక, రియాన్సిక, గగనశ్రీ మంచి ప్రతిభ ను కనుపరుస్తున్నారు. మా పిల్లలు మట్టిలో మాణిక్యాలని గురువు వారిని ఆశీర్వదించారు. ఈ సమావేశం లో అంగన్వాడీ టీచర్ శ్రీలత, స్కావెంజర్ శ్రీలత, ఆయా లక్ష్మి, పేరెంట్స్ రమ్య, రేణుక, సోమనర్సమ్మ, యాదమ్మ, ఉమ, మౌనిక, మరియు లలిత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని మసీదు గూడెం గ్రామానికి చెందిన పలువురు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆ గ్రామ సర్పంచ్ మర్రి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా వారిని చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్ తో కలిసి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించడం జరిగింది.తదనంతరం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా మారిందని,అత్యధిక సర్పంచ్ స్థానాలు గేలుచుకోవడం జరిగిందని అన్నారు.త్వరలో రాజగోపాల్ రెడ్డి మంత్రి కాబోతున్నారని నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బక్క లింగస్వామి,బక్క రమేష్,బక్క మహేష్,భక్త శ్రీనివాస్,బక్క మహేష్,బక్క ధనుంజయ,బక్క నవీన్,బక్క దాసు,రాచపాక బుచ్చయ్య,జిల్లెల ప్రశాంత్ రెడ్డి తది తరులు చేరారు.ఈ కార్యక్రమంలో మసీదు గూడెం సర్పంచ్ మర్రి వంశీధర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాటేపల్లి నవీన్,మాజీ మున్సిపల్ లో ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్,మాజీ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్,మసీదు గూడెం ఎన్నికల ఇంచార్జ్ కంచరకుంట్ల రాంరెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి,సాయి,గణేష్,శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రలోని ఆధునిక గణిత శాస్త్ర ఆది గురువైన శ్రీనివాస్ రామాంజనేయులు జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం లాగానే నేషనల్ మ్యాథ్స్ జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా ప్రముఖ త్రినిటీ విద్యాసంస్థలు విద్యార్థిని విద్యార్థినుల యొక్క ప్రతిభను వెలికితీయడానికై రామానుజన్ ఒలంపియాడ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2025 I to X విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం పరీక్ష యొక్క ప్రశ్నాపత్రాలను మండల విద్యాధికారి గురువారావు ఆవిష్కరించి పరీక్షలను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమం విద్యార్థులలోని సృజనాత్మకతను, సమయస్ఫూర్తిని,జ్ఞాపకశక్తిని, ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటం ఈ ప్రశ్న పత్రాల వలన విద్యార్థులకు అవగాహన వస్తుందని 100 ప్రశ్నలు,100 మార్కులు ప్రశ్నాపత్రాలలో ఉండడం వలన విద్యార్థులు ముందు ముందు జరగబోవు పోటీ పరీక్షలకు ముందస్తు సంసిద్ధత కలుగుతుందని ఆ పరీక్షల వలనే ఓఎంఆర్ షీట్ ఇవ్వడం ఈ పాఠశాలకే చెల్లిందని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమాన్ని త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు,డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, గణిత శాస్త్ర అధ్యాపకులు శివరాణి,శ్రీవాణి,రవీంద్ర,విజయ్ కుమార్,సౌజన్య,నీరజ,అవనిజ సామాన్య శాస్త్ర అధ్యాపకులు మాలిక్,రమేష్,శ్రీహరి,సంధ్యారాణి పోటీ పరీక్షల్లో పర్యవేక్షించారు.ఈ పోటీల ఫలితాలను శ్రీనివాస రామానుజన్ జయంతి రోజున డిసెంబర్ 22 వ తారీకున ప్రకటించి మేమంటోలను అందజేస్తారని ప్రకటించారు.

# ముంచుకొస్తున్న ఓటీపీ ముప్పు

## హైదరాబాద్ రియల్ఎస్టేట్‌లో నయా మోసాల పంథా

## ప్రీ లాంచ్‌కు ధీటుగా మోసాల తీవ్రత

*విశాలాభారతి, హైదరాబాద్: హైదరాబాదులో కొన్ని ఏళ్ల క్రితం మొదలైన 'ప్రీ లాంచ్ ఆఫర్' మోసాలు ఇప్పటికీ కొనసాగే ధోరణి కనిపిస్తోంది. రేరా నమోదు లేకుండానే అడ్వాన్స్‌లు, బుకింగ్ అమౌంట్లు తీసుకున్న ప్రాజెక్టులపై ఇప్పటివరకూ 27కిపైగా కేసులపై నోటీసులు జారీ చేసి, సుమారు రూ.21 కోట్ల వరకు జరిమానాలు వేసినట్టు రికార్డులు చూపుతున్నాయి. జయత్రి రియల్ ఎస్టేట్ వంటి సంస్థలు "ప్రీ లాంచ్ ఫ్లాట్లు, తక్కువ ధర" పేరుతో మధ్యతరగతి కొనుగోలుదారుల నుంచి రూ.300 కోట్లకు పైగా సేకరించి, నిర్మాణం పూర్తి చేయకపోవడంతో వందల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న కేసులు వెలుగులోకి వచ్చాయి. మరో కేసులో భువన్ తేజా ఇన్ఫ్రా సంస్థ ప్రీ లాంచ్ ఫ్లాట్ల పేరిట దాదాపు రూ.80 కోట్లను 300 మందికి దగ్గరగా ఉన్న కొనుగోలుదారుల నుంచి సమీకరించిందని ఈడీ గుర్తించి, దర్యాప్తు చేస్తోంది. అయితే తాజాగా సిటీ రియాల్టీలో మరో తరహా విక్రయానికి వ్యాపారులు తెరలేపారు. 'వన్ టైం పేమెంట్' – డిస్కౌంట్ పేరుతో మార్కెట్‌లో కొత్తగా "ఓటీపీ – వన్ టైం పేమెంట్" ఆఫర్ల హడావిడీ మొదలుపెట్టారు. కొన్నీ నిర్మాణ సంస్థలు "మొత్తం డబ్బు ఒక్కసారిగా చెల్లిస్తే 20–30% అదనపు డిస్కౌంట్, రిజిస్ట్రేషన్ వరకు మరే బాదరబందీ లేదు" అని కొనుగోలుదారులను బుట్టలో వేసుకొంటున్నాయి. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో విస్తృత ప్రచారం చేస్తు కొత్త స్కీములో బయ్యర్ల నుంచి పెద్ద మొత్తంలో సొమ్మును ముందుగానే రాబడుతున్నాయి. అయితే, ప్రాజెక్టు పూర్తి కాకపోతే డెవలపర్ చేతిలో క్యాష్ మొత్తం లాక్ అవుతుంది. సాధారణంగా బ్యాంకు లోన్ లేదా కన్స్ట్రక్షన్ లింక్డ్ ప్లాన్‌లో ఉండే ప్రోగ్రెసివ్ పేమెంట్, రేరా ద్వారా కనీస రక్షణ వంటి సేఫ్టీలు ఇక్కడ లేకుండా పోయాయి.*

**లోన్ ఉన్న ఓటీపీ డీల్స్: 'లేని ఇంటికి అప్పులు'**

కొన్ని ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఓటీపీ తరహా స్కీములకు లోన్ ఫెసిలిటీ ఇస్తున్నప్పటికీ, రిస్కు మొత్తం బయ్యర్ భుజాలపైనే పడుతోంది. "పొజెషన్ వరకు నో ఈఎంఐ, సబ్వెన్షన్ స్కీమ్" అంటూ ముందుగా బిల్డర్ ఇంటరెస్ట్ చెల్లిస్తానని చెప్పినా, ప్రాజెక్టు ఆలస్యం కావడంతో తర్వాత నిజమైన ఈఎంఐ భారం బయ్యర్‌కే వస్తుందని ఫైనాన్స్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్టు టైమ్‌లో పూర్తి కాకపోతే కొనుగోలుదారులు రెండు రకాల భారం మోయాల్సి వస్తుంది. అద్దె ఇల్లు ఉంటే నెలసరి రెంట్, తోడు బ్యాంకుకు ఈఎంఐ - రెట్టింపు ఖర్చు. ఇంకా తాళాలు చేతిలో లేని ఇంటికి క్రెడిట్ స్కోర్ దెబ్బతినేలా అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి. డెవలపర్ ఫైనాన్షియల్ కష్టాల్లో పడితే లేదా ఇంటరెస్ట్ చెల్లింపులు ఆపేస్తే, లోన్ బయ్యర్ పేరుపైనే ఉండడం వల్ల బ్యాంకులు నేరుగా కొనుగోలుదారులపైనే ఒత్తిడి తీసుకొస్తాయని ఆర్బీఐ మార్గదర్శకాలు ఉన్నాయని నిపుణులు పలు సందర్భాల్లో తిరిగి గుర్తు చేస్తున్నారు.

**గత మోసాల గణాంకాలు**

కొత్త ఓటీపీ ముప్పుకు హెచ్చరికగా హైదరాబాద్‌లో గత కొద్ది సంవత్సరాలుగా నమోదైన రియల్ ఎస్టేట్ మోసాలు తాజా ఓటీపీ ఆఫర్ల ప్రమాద తీవ్రతను మరింత బలోపేతం చేస్తున్నాయి. ఏవీ గ్రూప్, జయత్రి రియల్ ఎస్టేట్, ఎస్ఎస్ఎల్ఎస్ వంటి రియల్ ఎస్టేట్ సంస్థలు కొనుగోలుదారుల నుంచి కోట్ల రూపాయలను సేకరించి జెండా ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో పెట్టుబడిదారులు, ఫ్లాట్ బయ్యర్లు కలిపి వేల సంఖ్యలో బాధితులయ్యారని పోలీసు, ఇడీ దర్యాప్తు అంచనాలు సూచిస్తున్నాయి. టీజీ రేరా కూడా ఇప్పటికే "ప్రీ లాంచ్ ఆఫర్లు చట్ట విరుద్ధం" అని స్పష్టం చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన డెవలపర్లపై ప్రాజెక్ట్ ఖర్చు 10% వరకు జరిమానా విధించవచ్చని హెచ్చరికలు జారీ చేసింది. ఒక కేసులో రేరా, ప్రీ లాంచ్ ఆఫర్ పేరిట రిజిస్ట్రేషన్ లేకుండా డబ్బు సేకరించిన డెవలపర్‌పై రిఫండ్‌తో పాటు 11% వడ్డీ చెల్లించాలంటూ ఆదేశించి, అదనంగా రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది.

**కొనుగోలుదారులరా బహూపరాక్..**

ఓటీపీ, ప్రీ లాంచ్, నో ఈఎంఐ వంటి ఆకర్షణీయ స్కీములు రియల్ ఎస్టేట్ మార్కెట్లో క్యాష్ ఫ్లో సమస్యలతో ఉన్న డెవలపర్లకు తక్షణ ప్రాణవాయువుల మారుతున్నాయి. సాధారణ బయ్యర్లను కూడా ఆఫర్ల మాయలో పడి కొట్టుమిట్టాడే పరిస్థితులు వచ్చే అవకాశం ఉంది. నిలకడలేని సంస్థలతో కష్టార్జితం మొత్తం ఇసుకలో పోసిన పన్నీరు అవుతుంది. కొనుగోలుదారులు తప్పనిసరిగా ఈ చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాజెక్టు రేరా వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిందా,? రిజిస్ట్రేషన్ నంబర్ నిజమా;? అనే దాన్ని ముందుగా చెక్ చేయాలి. లీగల్ డ్యూ డిలిజెన్స్: టైటిల్ క్లియరెన్స్, భూమి వివాదాలు, బిల్డింగ్ ప్లాన్లకు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ వంటి సంస్థల అప్రూవల్స్ ఉన్నాయా? లాయర్ ద్వారా పరిశీలించాలి. పేమెంట్ ప్లాన్ ఎంపిక ఓటీపీ, సబ్వెన్షన్ కన్నా, కన్స్ట్రక్షన్ లింక్డ్ పేమెంట్ ప్లాన్‌లు రిస్క్‌ను కొంతవరకు తగ్గిస్తాయి. ప్రోగ్రెసివ్ పేమెంట్ మోడల్‌ను ప్రాధాన్యత ఇవ్వడం మంచిదని ఫైనాన్స్ నిపుణులు వివరిస్తున్నారు. అదనపు డిస్కౌంట్‌ల ఆశలో 'వన్ టైం పేమెంట్' స్కీములను నమ్మి దూకితే, భవిష్యత్తులో "లేని ఇంటికి అప్పులు చేసిన" పరిస్థితికి కొనుగోలుదారులకు కష్టసాధ్యం కావచ్చని రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు 'ప్రీ లాంచ్ ఆఫర్' పేరుతో అమాయకుల్ని మోసం చేసిన రియల్ ఎస్టేట్ పంథా ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి రంగప్రవేశం చేస్తోంది. తాజాగా మార్కెట్‌లోకి వచ్చిన 'ఓటీపీ - వన్ టైం పేమెంట్' ఆఫర్లు, అధిక డిస్కౌంట్ల ముసుగులో మధ్య తరగతి కొనుగోలుదారులను మరోసారి ప్రమాదంలోకి నెడుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. వన్ టైం పేమెంట్' పేరుతో కొత్త వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యానికి తోడు, ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో "ఓటీపీ - వన్ టైం పేమెంట్" ఆఫర్లతో నయా మోసాల మాయలకు చిక్కొద్దనీ హెచ్చరిస్తున్నారు.

## డిస్కౌంట్ వెనక దాగిన రిస్క్

**మొత్తం నగదు ముందే లాక్**
ఓటీపీ స్కీములో చెల్లించిన సొమ్ము నిర్మాణం పూర్తయ్యే వరకు పూర్తిగా డెవలపర్ చేతుల్లోనే ఉంటుంది.

**ప్రాజెక్టు ఆలస్యం అయితే రక్షణ తక్కువ**
కన్స్ట్రక్షన్ లింక్డ్ ప్లాన్‌లో ఉండే దశలవారీ చెల్లింపులు, రేరా సేఫ్టీలు ఇక్కడ కనిపించవు.

**లోన్ ఉన్నవారికి రెండో భారం**
ఇల్లు రాకముందే బ్యాంకు ఈఎంఐలు లేదా వడ్డీలు చెల్లించాల్సి రావడం వల్ల అద్దె మరియు ఈఎంఐ భారం పడుతుంది.

**క్రెడిట్ స్కోర్ ప్రమాదంలో**
డెవలపర్ చెల్లింపులు ఆపేస్తే, లోన్ బయ్యర్ పేరుపైనే ఉండడంతో క్రెడిట్ రేటింగ్ దెబ్బతింటుంది.

**చట్టపరమైన పరిష్కారం కాలం తీసుకుంటుంది**
రిఫండ్ కోసం రేరా లేదా కోర్టుల బాట పట్టాల్సి వస్తే, డబ్బు తిరిగి రావడానికి సంవత్సరాలు పట్టవచ్చు.

**తాత్కాలిక లాభం – దీర్ఘకాల అప్పు**
డిస్కౌంట్ తాత్కాలికం మాత్రమే; ఒకసారి తీసుకున్న అప్పు మాత్రం సంవత్సరాల పాటు వెంటాడుతుంది.





# కర్లీతోనే కష్టాలు!

రింగుల జుట్టుతో రంగుల ప్రపంచపు రారాణిగా వెలుగొందింది తాప్సీ పన్ను. అయితే, తన గ్లామర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆ కర్లీ హెయిర్.. కొన్ని సందర్భాల్లో తనకే చిక్కులు తెచ్చిపెట్టిందని చెబుతున్నది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన రింగుల జుట్టు కారణంగా అనేక అవకాశాలు కోల్పోయానని వాపోయింది. "సినిమాల్లోకి అడుగుపెట్టిన మొదట్లో.. నాకు స్టోరీ చెప్పడానికి వచ్చిన దర్శకులంతా నా జుట్టును సరిచేసుకోవాలని చెప్పేవారు. కేవలం స్ట్రెయిట్ హెయిర్‌తోనే గ్లామర్, స్టయిలిష్ లుక్ వస్తుందని ఆ దర్శకులు అనుకునేవారు. ఇక రింగుల జుట్టు అంటే.. 'రెబల్ రూల్స్' అని భావించేవారు. కర్లీ హెయిర్ ఉన్న అమ్మాయిలు.. నెగెటివ్ పాత్రలకే పనికొస్తారనీ, సంప్రదాయబద్ధంగా ఉండే అమ్మాయిగా కనిపించలేరనీ చెప్పేవారు" అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది. అందుకే, సినిమా అవకాశాల కోసం మొదట్లో తన జుట్టును స్ట్రెయిట్ చేయించుకోవడానికి అంగీకరించిందట. అయితే, ఆ తర్వాత సినిమాలతోపాటు ప్రకటనల్లోనూ తన జుట్టును సరిచేయించుకోవాలని చెప్పేవారట. "నాతో యాడ్స్ చేయడానికి పెద్దపెద్ద బ్రాండ్స్ ఆసక్తి చూపించేవి. కానీ, నా రింగుల జుట్టును మార్చుకోవాలని చెప్పేవి. అలా, నేను సినిమాలతోపాటు చాలా యాడ్స్ కూడా రిజెక్ట్ చేశాను" అంటూ చెప్పుకొచ్చింది. ఇక తన చిన్ననాటి ముచ్చట్లనూ పంచుకుంటూ.. "బాల్యంలో కర్లీ హెయిర్ ఉన్నవాళ్లు చాలా తక్కువగా ఉండేవారు. అందుకే, ఇలా ఉండటం అసాధారణమనే భావనలో ఉండేదాన్ని. అయితే, సరైన అవగాహన లేక రింగుల జుట్టుతో ఇబ్బందులు పడ్డా. చివరికి నా జుట్టును అర్థం చేసుకుని.. సరైన ఉత్పత్తులు వాడుతూ, సంరక్షించుకున్నా!" అంటూ గుర్తుచేసుకున్నది. 'ఝుమ్మంది నాదం' సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది తాప్సీ. వరుస అవకాశాలు దక్కించుకుంటూ.. టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. ఆ తర్వాత బాలీవుడ్ బాటపట్టి.. అక్కడా వరుస హిట్స్ అందుకున్నది. పలు వెబ్ సిరీస్‌లలోనూ మెరిసింది. పెళ్లి తర్వాత సినిమాలు తగ్గించింది. చివరిసారిగా అక్షయ్ కుమార్ సరసన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలో కనిపించింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.